ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5 నంద్యాల

జిల్లా వార్తలు

బుధవారం 1 మే 2024

- దోన్‌లో టీడీపీ నాయకులే టార్గెట్
- మంత్రి బుగ్గన కనుసన్నల్లో బెదిరింపులు
- ఆస్తుల కూల్చివేతలు.. అక్రమంగా కేసులు
- అధికారుల దాడులతో మైనింగ్ వ్యాపారాలు మూత
- వైసీపీ కండువాలు కప్పుకోలేదని బిల్లులూ పెండింగ్



టీడీపీ నేత ఎంకేఎస్ హోం టౌన్ వెంచరులో గోడను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

అధికార అరాచకం

డోన్, ఏప్రిల్ 30:

అధికారం అండతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో చెలరేగిపోయారు. పోలీసులు, అధికారులను అడ్డం పెట్టుకుని సాగించిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. టీడీపీ నాయకుల ఆస్తులు, వ్యాపారాలే టార్గెట్‌గా విధ్వంసాలు సృష్టించారు. మంత్రి గురి పెడితే సరి.. ప్రత్యర్థుల ఆస్తుల మీదకు ఎక్స్‌కవేటర్లు వచ్చి వాలిపోతాయి. మంత్రికి వ్యతిరేకంగా పని చేసిన వారి మైనింగ్ వ్యాపారాలను మూసి వేయించి ఆర్థికంగా దెబ్బతీసిన ఘటనలూ ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడడంతో మంత్రి బుగ్గన ప్రదర్శిస్తున్న వినయం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. డోన్ అసెంబ్లీ నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆర్థిక శాఖ మంత్రి పదవిని అలంకరించారు. రాష్ట్ర స్థాయిలో ఎంతో పలుకుబడి ఉన్న మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలో ప్రత్యర్థులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారన్న విమర్శలు ఉన్నాయి. అధికార బలంతో టీడీపీ నాయకులను టార్గెట్ చేసి వేధింపులకు గురి చేశారన్నది రాజకీయ వర్గాల్లో ఉన్న టాక్.



డోన్ పట్టణంలో కూల్చివేతకు నిలువెత్తు సాక్ష్యం విజయ థియేటర్

టార్గెట్ చేస్తే అంతే..!

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన కొనసాగించిన బెదిరింపులు, కూల్చివేతలకు సజీవ సాక్షులుగా ఎన్నో కనిపిస్తున్నాయి. డోన్ పట్టణానికి చెందిన టీడీపీ నేత మర్రి రమణకు విజయ థియేటర్ ఉంది. గత ఎన్నికల్లో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వ్యతిరేకంగా పని చేశాడని మర్రి రమణను టార్గెట్ చేశారు. ఎప్పుడో 38 ఏళ్ల క్రితం నిర్మించిన విజయ థియేటర్ నిబంధనల ప్రకారం లేదని మున్సిపల్ అధికారులతో దాడులు చేయించారు. పోలీసు బందోబస్తుతో ఏకంగా థియేటర్‌ను కూల్చివేశారు. గతంలో టీడీపీ ఇన్‌చార్జిగా ధర్మవరం సుబ్బారెడ్డిని కూడా బుగ్గన టార్గెట్ చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో సుబ్బారెడ్డి నివాసంలో పోలీసులతో సోదాలు నిర్వహించి పెళ్లికి సంబంధించిన చిన్న కత్తులు దొరకడంతో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించినట్లు విమర్శలు న్నాయి.. అంతేగాక సుబ్బారెడ్డికి సంబంధించిన మైనిం గ్ కాంట్రాక్టు వ్యాపారాలన్నీ మూసివేయించి ఆర్థికంగా దెబ్బ తీశారు.

వైసీపీ కండువా కప్పుకోలేదని..

ప్యాపిలి మండలంలోని ఆలేబాదు గ్రామానికి చెందిన పరమేశ్ సోదరులకు టీడీపీలో మంచి పట్టుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు కింద రూ.6 కోట్ల మేర పనులు చేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు పెండింగ్‌లో ఉంచేశారు. వైసీపీ కండువా కప్పుకుంటే బిల్లులు చేస్తామని మంత్రి బుగ్గన టీడీపీ నాయకులు ఆలేబాదు పరమేశ్‌పై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. అయితే.. బిల్లులు రాకున్నా పర్వాలేదని, వైసీపీ కండువా కప్పుకునేది లేదని సదరు టీడీపీ నేత తెగేసి చెప్పారు. దీంతో బిల్లుల చెల్లింపులు జరగకుండా మంత్రి బుగ్గన అడ్డుకున్నట్లు విమర్శలున్నాయి. అదే విధంగా డోన్ మండలంలోనూ పలువురు టీడీపీ నాయకులకు బిల్లులు చెల్లించేందుకు వైసీపీ కండువాలు కప్పుకోవాలని తీవ్ర స్థాయిలో బెదిరింపులు చేశారు. పలువురు టీడీపీ నాయకులు వైసీపీ కండువాలు కప్పుకునేందుకు ఆసక్తి చూపలేదు.

కొమ్మూరు కొట్టాలలో రైతు పొలం మధ్యలో రోడ్డు వేస్తూ నిలిపివేసిన పనులు

చంద్రబాబు ఆయన ఇంటికి వెళ్లాడని..

పట్టణంలోని టీడీపీ నేత మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడుకు సాక్షి నివాస్ పక్కన వెంచర్ ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ పర్యటనలో మురళీకృష్ణ గౌడు ఇంటికి వెళ్లారు. దీంతో సదరు టీడీపీ నేతను టార్గెట్ చేసి సాక్షి నివాస్ రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ నిర్మించారని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు మంత్రి వేధింపులు తట్టుకోలేక మూడేళ్లపాటు బయటి ప్రాంతాల్లోనే నివాసం ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. పట్టణంలోని మరో టీడీపీ నేత కోట్రికే ఫణిరాజ్ తండ్రి కోట్రికే నాగభూషణం శెట్టి రామసుబ్బయ్య తోటలో స్థలం కొనుగోలు చేసి 35 ఏళ్ల క్రితమే ఇల్లును నిర్మించారు. సదరు నేతను టార్గెట్ చేసి నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం లేదని కూల్చివేశారు. టీడీపీలో చురుకుగా ఉన్న రేగటి అర్జున్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలాపురం సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. అధికార వైసీపీ వేధింపులను తట్టుకుని టీడీపీ మద్దతుదారుడుగా అర్జున్ రెడ్డి విజయం సాధించడంతో మంత్రి బుగ్గన టార్గెట్ చేశారు. అర్జున్ రెడ్డికి చెందిన ఫర్మ్‌కు సంబంధించి సిమెంటు లారీ లోడింగ్ చేయగా... బిల్లులు సక్రమంగా లేవంటూ పోలీసులు ఒక రోజంతా పోలీస్‌స్టేషన్‌లోనే నిర్బంధించారు. మంత్రి బుగ్గన ఆదేశాలతో పోలీసులు ఒత్తిళ్లు తెచ్చి అర్జున్ రెడ్డికి వైసీపీ కండువాను వేశారు. అయితే.. అర్జున్ రెడ్డి 15 రోజుల క్రితం వైసీపీకి గుడ్‌బై చెప్పి మళ్లీ టీడీపీలో చేరారు. ఇలా మండలంలో పలువురు టీడీపీ నాయకుల ఆస్తులను, వ్యాపారాలను మంత్రి బుగ్గన దెబ్బతీస్తూ వచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రిని కాదంటే.. వ్యాపారాలు మూసుకోవాల్సిందే

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గనను కాదని ఎదురు తిరిగితే.. మైనింగ్ వ్యాపారాలు మూసుకోవాల్సిందే. మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన దశరథరామిరెడ్డికి చనుగొండ్ల వద్ద గ్రానైట్ క్వారీ ఉంది. మంత్రికి వ్యతిరేకంగా పని చేశాడని సదరు టీడీపీ నేత గ్రానైట్ క్వారీలో పనులు చేసుకోకుండా మూసి వేయించారు. అదేవిధంగా డోన్ మండలంలోని పలువురు టీడీపీ నేతల మైనింగ్ గనులను మూసివేయించారు. ప్యాపిలి మండలంలోని బావిపల్లి సర్పంచ్‌కు టీడీపీ నాయకులు లింగన్నకు మైనింగ్ గని ఉంది. వైసీపీ కండువా కప్పుకోవాలని మంత్రి బుగ్గన తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. అందుకు ససేమిరా అనడంతో టీడీపీ నేత మైనింగ్ గనిని మూసివేయించారు. బేతంచెర్ల మండలంలో టీడీపీ నాయకులు ఎల్లనాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, విజయుడు, తదితరుల మైనింగ్ గనులపై విజిలెన్స్ అధికారులతో దాడులు చేయించారు. మంత్రి బుగ్గన అధికార బలంతో సదరు టీడీపీ నాయకులను టార్గెట్ చేసి ఆర్థికంగా భారీగా దెబ్బతీసినట్లు విమర్శలున్నాయి. బేతంచెర్లకు చెందిన మరో టీడీపీ నేత షేక్షావలి చౌదరికి లారీలు ఉన్నాయి. ఎంవీఐ అధికారులతో దాడులు చేయిస్తూ లారీలకు పెద్ద ఎత్తున జరిమానాలు విధించి ఆర్థికంగా దెబ్బతిసినట్లు ఆరోపణలున్నాయి.. బేతంచెర్ల మండలంలోని కొమ్మూరు కొట్టాల సమీపంలో మంత్రికి సంబంధించిన మైనింగ్ గనులున్నట్లు తెలుస్తోంది. అక్కడ రైతు రవికుమార్ పొలంలో మైనింగ్ గనికి రోడ్డు వేయించేందుకు అధికార బలం ప్రయోగించారు. అయితే.. సదరు రైతు నంద్యాల ఎస్పీ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో రైతు పొలంలో అడ్డంగా రోడ్డు వేసే ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. డోన్ నియోజకవర్గంలో అధికార వైసీపీ అరాచకాలు కోకొల్లలు.

నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు

కలెక్టర్ కె. శ్రీనివాసులు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 30: లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు నియోజకవర్గాల వారిగా అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల జాబితా సంఖ్య 17 నుంచి 32లోపు వుంటే రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతాయని, ఈ మేరకు అదనపు బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి వుండటంతో బెంగుళూరు నుంచి 3,325 బ్యాలెట్ యూనిట్లు తీసుకువస్తామని అన్నారు. .రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో టెక్కె మార్కెట్ యార్డులో వున్న స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన 245 బ్యాలెట్ యూనిట్లును డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి తరలించడం గురించి ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

హోమ్ ఓటింగ్ ప్రక్రియపై సమీక్ష

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు కల్పించిన హోమ్ ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో హోమ్ ఓటింగ్ ప్రక్రియపై మైక్రో అబ్జర్వర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో 15,509 విభిన్న ప్రతిభావంతులు, 5వేల మంది 85 సంవత్సరాలు నిండిని సీనియర్ సిటిజన్స్ వున్నారని అన్నారు. వారికి ఇంటివద్దనే ఓటు వేసే హక్కును కల్పించి హోమ్ ఓటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

జగన్ మాటలు నమ్మొద్దు



అల్లూరులో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

- ఆయన మారీచుడిలాంటి వాడు
- తెలుగుదేశం వస్తేనే గ్రామాల అభివృద్ధి
- చంద్రబాబు

నందికొట్కూరు రూరల్ ఏప్రిల్ 30 : జగన్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఆయన మారీచుడిలాంటి వాడని, చాలా జాగ్రత్తగా వుండాలని తెలుగదేశం పార్టీ జాతీయ అధ్యక్ష్యుడు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాగళం కార్యక్రమానికి వచ్చిన చంద్రబాబు అల్లూరులో బసచేసి నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఇంట్లో మంగళవారం గ్రామస్థులు, యువకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి రామాయణంలోని మారీచునిలా గంటకో రూపం, రోజుకో అవతారం ఎత్తుతూ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలతో మాయమాటలు చెప్పి మోసపుచ్చడానికి మళ్లీ వచ్చాడని అన్నారు. ఆయన మాటలు నమ్మవద్దని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఎప్పుడో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడా రోడ్లులేవన్నారు. యువతకు వుద్యోగ కల్పన, ముఖ్యంగా ఐటీ రంగంలో విశేషంగా ఉద్యోగాలు కల్పించిన ఘనత టీడీపీదే అన్నారు. పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అందరికీ మేలు చేస్తాయని అన్నారు. మహిళలకు వారు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పతాయన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు మంచి మార్గాలు చూపెడతామన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం మొదలైందని అన్నారు. నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా యువకుడు, ఉత్సాహవంతుడు, స్థానికుడు అయిన గిత్తా జయసూర్యను నిలబెట్టామని అన్నారు. అతనికి మీ సమస్యలు తెలిసిన వాడు కాబట్టి మీకు మేలు జరుగుతుందని అన్నారు. వైసీపీ అభ్యర్థి ఎక్కడో హైదరాబాదులో వుంటాడని అతనికి మీ సమస్యలు ఎలా తెలుస్తాయని అడిగారు. గతంలో ఇలాగే వైసీపీ స్థానికేతరుడైన ఆర్థర్‌ను తీసుకుని వచ్చి అతనికి అధికారం ఇవ్వకుండా ఇక్కడ వున్న వైసీపీ నాయకులు పెత్తనం చెలాయించి నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. అలా జరగకుండా వుండేందుకు మీకు మాండ్ర శివానందరెడ్డి మంచి యువకుడిని వెతికి పెట్టాడని అన్నారు. ఇతన్ని గెలుపించుకోవాలన్నారు. అలాగే నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాజశేఖర్, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గుండం రమణారెడ్డి, ప్రసాదరెడ్డి, ఓబుల్ రెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, మాండ్ర లింగారెడ్డి, మాజీ టీడీపీ ఇన్‌చార్జ్ తమ్మడపల్లె విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అల్లూరు గ్రామస్థులు

వాహనాల తనిఖీ లో రూ.1.45 లక్షలు స్వాధీనం

పాణ్యం, ఏప్రిల్ 30 : స్థానిక బస్టాండు సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలో రూ. 1.45 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది మంగళవాం బనగానపల్లె నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఏపి 21 బీఎల్ 3818 నెంబరు గల మోటారు సైకిల్‌ను తనిఖీ చేయగా అందులో రూ. 1.45 లక్షలు గుర్తించినట్లు తెలిపారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన అంగజాల రామచంద్రుడుకు చెందిన ఈ నగదుకు ఎటువంటి పత్రాలు, రుజువులు లేకపోవడంతో నగదును పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 30: గాజులపల్లెలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్‌జిల్లా చెక్‌పోస్టులలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బంగారం, వెండి, నగదు, మద్యం, గంజాయి, ఇతర విలువైన వస్తువుల అక్రమంగా రవాణా కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందని ఉందన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, నంద్యాల తాలుకా రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు..

కాటసాని.. అసమర్థ ఎమ్మెల్యే

- దద్దనాల ప్రాజెక్టును నిర్వీర్యం చేశాడు
- టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఆగ్రహం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 30: పడమటి పల్లెలకు సాగు, తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోపడే దద్దనాల ప్రాజెక్టును పట్టించుకోని అసమర్థ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని పసుపుల, పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పాతపాడులో ఆయన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దద్దనాలకు కొచ్చెరువు నుంచి నీళ్లు తెప్పిస్తానన్న హామీని కాటసాని రామిరెడ్డి గాలికి వదిలేశాడన్నారు. ఎస్సార్బీసీ నీటిని దద్దనాలకు పంపింగ్ చేయకుండా పడమటి పల్లెల్లో తాగు, సాగునీటి ఎద్దడికి కారణమైన కాటసానికి రైతులు, ప్రజలే తగినబుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

పింఛన్.. టెన్షన్

బ్యాంకు ఖాతాలో జమ చేస్తే ఇబ్బందులే..



పెద్దఓబులేసు, అంధుడు, హరివరం

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 30 : మండలంలోని పింఛనుదారులకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఏప్రిల్‌లో పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది తమ సొంత గ్రామాల్లోనే పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మే నెల పింఛను సొమ్మును లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో పింఛనుదారుల్లో ఆందోళన మొదలైంది. బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేయడం వల్ల ఇబ్బందులు తప్పవని హరివరం గ్రామానికి చెందిన పింఛన్‌దారులు పెద్ద ఓబులేసు, జయమ్మ ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారు గ్రామం నుంచి 15 నుంచి 30 కి.మీ దూరం వెళ్లి డబ్బులు తెచ్చుకోలేని పరిస్థితి. ఇళ్ల వద్దనే ప్రభుత్వం పింఛన్ సొమ్ము అందజేయాలని కోరుతున్నారు.



జయమ్మ, వితంతు పింఛనుదారు, హరివరం

గోడ దూకుళ్లపై రచ్చబండ సంభాషణ

రంగన్న : ఏందిరో నాగన్నా. యాడికి పొద్దున్నే పోతున్నావు

● **నాగన్న :** నీకు తెలవందేముందిలే మామ.. ఓట్లొచ్చినాయిగదా మనలాంటోళ్లకు ఇట్టాటప్పుడే గిరాకీ ..

● **రంగన్న :** అవ్నురో నువ్వు సెప్పేది నిజమే .. నాయకులకు మనం గుర్తుకొచ్చేది ఇసువంటప్పుడేరోయ్ ..

● **నాగన్న :** మరి మనమిప్పుడే నాలుగురాళ్లు యనకేసుకోవాలి .. మళ్లా వాళ్లు మనకు దొరకరుగదా మామ ..

● **రంగన్న :** అవున్రా నాగన్న .. మన సందోళ్లేందిరా మొన్న నాగిరెడ్డి పార్టీలో చేరిరి. నిన్న గంగిరెడ్డి పార్టీలో కనబడిరి.

● **నాగన్న :** అదా మొన్న మనూరి నాయకుడు మంచికి ఐదొందలు, మందు, బిర్యాని అంటే అట్టా పోయిరి. వాళ్ల జెండా కప్పుకుండిరి. నిన్నేమో ఈ పార్టోళ్లు మంచికి వెయ్యి, బిర్యాని అనిరి. వాళ్లకేమైనా దుడ్లు సేదా మామ నిన్న వీళ్లమ్మడి పోయి ఈ జెండా కప్పుకుండిరి.

● **రంగన్న :** ఓర్నీ మనోళ్లు కూడా జెండా మార్సడంలో లీడర్లను మించుతున్నార్రోయ్ ..

● **నాగన్న :** అంతేగదా మామ .. సరే సరే మనోళ్లు ఫోన్ జేచ్చున్నరు పోయొచ్చా. ఈయాల దుగ్గిరెడ్డి పార్టీకి పోతన్నాం ..

● **రంగన్న :** సర్లే .. పోతేపోతివిగానీ ఒకమాట సెప్తా ఇనురా. ఇట్టా జెండాలు మార్శితే దుడ్లొస్తాయోమోగానీ ఎవ్వరి కాడా ఇలువ వుండదురా నాగన్నా ..

- కొలిమిగుండ్ల రూరల్



తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం

నాయకుడికి నిబద్ధత ఉండాలి



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే మేము మంచి నాయకుడిని ఎన్నుకుంటాం. మంచి నాయకుడి వల్లే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. యువత భవిష్యత్తుకు ఆధారమైన పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చే వారే కావాలి. ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడిని ఎన్నుకుంటాం.

- సయ్యద్ అల్తాఫ్, డిగ్రీ, చాగలమర్రి

ఓటు హక్కు బాధ్యతగా తీసుకోవాలి



ఓటును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. తన ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవడంతోపాటు దీనిని తన గెలుపుగా భావించాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. తన ఓటు తన భవిష్యత్తుగా ఓటరు భావించాలి. ఐటీ పరిశ్రమలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

- సయ్యద్ కరిముల్లా, డిగ్రీ, చాగలమర్రి

ఓటుపైనే మన భవిష్యత్తు



విజ్ఞానవంతులైన విద్యార్థులు మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే సమాజం బాగుంటుంది. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆ దిశగా ఆలోచన చేసే నాయకుడిని మాత్రమే ఎన్నుకోవాలి. డబ్బు ప్రభావానికి గురి కాకుండా ఓటు వినియోగించుకోవాలి.

- సాదిక్ అలీ, డిగ్రీ, చాగలమర్రి

కుడి చేతి వేలికి సిరా ఎవరికి వేస్తారో తెలుసా..!



ఆత్మకూరు, ఏప్రిల్ 30: ఎన్నికల్లో సాధారణంగా రెండో సారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా గుర్తు వేస్తారు. ఓటర్ల సహాయకులుగా వచ్చిన వారికి మాత్రం కుడి చేతి చూపుడు వేలిపై వేస్తారు. ఎవరైనా ఓ వ్యక్తి కుడి, ఎడమ చేతి చూపుడు వేళ్లకు సిరా గుర్తు ఉన్నట్లయితే అతడు తన ఓటు వేయడంతోపాటు ఇంకో వ్యక్తికి సహాయకుడిగా వెళ్లి ఓటు వేశాడని అర్థం. అయితే ఒక పోలింగ్ బూత్ పరిధిలోని వ్యక్తి అదే పోలింగ్ బూత్ పరిధిలోని ఓటరుకే సహాయకుడిగా ఉండాలే కానీ వేరు పోలింగ్ బూత్‌లోని ఓటరుకు సహాయకుడిగా ఉండరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా తెలంగాణ గత అసెంబ్లీ ఎన్నికల వేళా కేంద్ర ఎన్నికల సంఘం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులు, వయోవృద్ధులను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకొచ్చే ఓటు వేయించే సహాయకుల కుడిచేతి చూపుడు వేలుకు సిరా గుర్తు చేయాలని వెల్లడించింది.

ఓటర్లకు ఎడమ చేతి చూపుడు వేలుకు మాత్రమే సిరా ఎందుకు వేస్తారంటే :

మనదేశంలో చాలా మంది కుడిచేతి వాటం కలిగిన వారే ఉంటారు. కుడి చేతిపై తడి సిరా వేస్తే బ్యాలెట్ సందర్భంలో బ్యాలెట్ పత్రాన్ని పాడు చేసే అవకాశం ఉంటుందని ఎడమ చేతిని ఎంచుకున్నారు. ప్రస్తుతం ఈవీఎంల వినియోగం సందర్భంలో కూడా కుడి చేసి చూపుడు వేలుకు సిరా ఉంచినట్లయితే ఈవీఎంలకు సిరా ఇంకు అంటించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కుడి చేతికి సిల్వర్ నైట్రేట్ మొదలైన రసాయనాలతో కూడిన సిరా అంటించినట్లయితే తినే ఆహారంలో కలిసే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎడమ చేతి చూపుడు వేలు మీద సిరా వేస్తే మిగతా వేళ్ల కంటే సౌకర్యవంతంగా ఉంటుందని ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.



ఆదర్శ రాజకీయవేత్త

- ప్రజాసేవకే రూ. కోట్ల ఆస్తులు ● నంద్యాల గాంధీగా నీరాజనాలు
- నంద్యాల పురపాలక సంఘం మొట్టమొదటి చైర్మన్‌గా చెరగని ముద్ర
- వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకి
- ఈ ఎన్నికల వేళ స్మరించుకోవలసిన మహామనిషి కాదర్‌బాద్ నరసింగరావు



అప్పటి బ్రిటీష్ అధికారులతో కాదరబాద్ నరసింగరావు (మధ్యలో పంచ, మెడలో కండువా వేసుకున్న వ్యక్తి)

ఎన్నికల సందర్భంలో గుర్తు చేసుకోవలసిన మహా వ్యక్తి కాదరబాద్ నరసింగరావు. సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో, రాజకీయాల్లో కొనసాగినా మచ్చ పడని నిష్కళంక నాయకుడు. అచ్చమైన గాంధేయవాదిగా జీవించి నంద్యాల గాంధీగా పేరు పొందారు. నాలుగేళ్లు రాజకీయాల్లో ఉంటే కోట్లకు పడగలెత్తి, వారసత్వ రాజకీయాలను కొనసాగిస్తున్న ఈ రోజుల్లో నరసింగరావు ఆదర్శాలు అపురూపమనిపిస్తాయి.

- నంద్యాల టౌన్

నంద్యాల పురపాలక సంఘం 1899లో ఆవిర్భవించింది. అప్పటి నుంచి 1920 వరకు బ్రిటీష్ పాలనలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలనాయంత్రాంగం నడిచింది. అయితే అప్పటికే మహాత్మాగాంధీ ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని నరసింగరావు నంద్యాలలో ప్రతి ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తుండేవారు.

● ఈ నేపథ్యంలో 1920 నుంచి 1934 వరకు నంద్యాల పురపాలక సంఘానికి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా కొనసాగారు. 1934 నుంచి 1962 వరకు నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 28 సంవత్సరాలు కొనసాగారు. ఏ పదవిలో ఉన్నా అజాతశత్రువుగా నరసింగరావు ప్రజల మన్ననలను పొందారు.

● 1947లో, 1952లో దళితోద్ధరణకు ఎంతగానో కృషి చేశారు. దళితులకు ప్రత్యేక హాస్టళ్లను నెలకొల్పి, విద్యారంగంలో వాళ్లు ఉన్నత స్థాయికి చేరుకోడానికి దోహదం చేశారు.

● గ్రంథాలయ ఉద్యమనేత గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో నరసింగరావు నంద్యాల కేంద్రంగా రాయలసీమ అభివృద్ధికి కోసం అప్పట్లోనే సమావేశాలు నిర్వహించారు. పెద్ద మనుషుల ఒప్పందం శ్రీబాగ్ ఒడంబడికకు కృషి చేశారు.

● నంద్యాల పట్టణ నడిబొడ్డున ప్రస్తుతం ఉన్న మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయానికి తన భూమిని దానం చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలకు పురపాలక శాఖ కాదరబాద్ నరసింగరావు మెమోరియల్ పాఠశాలగా 2005లో నామకరణం చేశారు. దీని విలువ రూ.కోట్లల్లో ఉంది.

● నంద్యాల పట్టణం నుంచి భీమవరానికి వెళ్ళే రస్తాలో నరసింగరావు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కుందూనదిపై బ్రిటిష్ హయంలో నిర్మించిన బ్రిడ్జిపై ఇప్పటికీ రాకపోకలు జరుగుతున్నాయి.

● వ్యవసాయ రంగ అభివృద్ధిలో చెరువు కట్ట ఆయకట్టు భూముల్లో ఆనాడే విప్లవాత్మక వ్యవసాయ రంగానికి పునాదులు వేశారు.



● భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, జాతిపిత మహాత్మాగాంధీ, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, కల్లూరి సుబ్బారావు, తెన్నేటి విశ్వనాథం, కళా వెంకటరావు, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, భోగరాజు రామచంద్రరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, గాడిచెర్ల ఇలా ఎందరో అతిరథ మహారథులు నంద్యాలకు వచ్చి కాదరబాద్ నరసింగరావు ఇంట్లో ఆతిథ్యం స్వీకరించేరు.

● ఆంధ్రతిలక్ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు కొన్నేళ్ళ పాటు నంద్యాలలో నివాసం ఉన్నారు. కాదరబాద్ నరసింగరావుకు అత్యంత సన్నిహితుడిగా మెలిగి, ఆయన నిస్వార్థ సేవలను గమనించి నంద్యాల గాంధీ అని గౌరవించారు.

● వారసత్వ రాజకీయాలను వ్యతిరేకి :

కాంగ్రెస్‌పార్టీలో దేశస్థాయిలో నాయకులకు ఆప్తునిగా మెలిగిన నరసింగరావు తన కుటుంబంలో వారసత్వ రాజకీయాలను కొనసాగించదల్చుకోలేదు. ఏడు మంది కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నా, వీరు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారేగాని తండ్రి ప్రాపకంతో రాజకీయల వైపు తొంగి చూడలేదు.

● నంద్యాల గాంధీపై ప్రత్యేక పుస్తకం :

1888 నుంచి 1963 వరకు నరసింగరావు జీవిత చరిత్రను నంద్యాల గాంధీ పేరుతో ప్రముఖ రచయిత గొట్టిముక్కల సుబ్రహ్మణ్యం శాస్త్రి రాశారు. ఈ పుస్తకావిష్కరణకు శాసన మండలి చైర్మెన్ చక్రపాణియాదవ్, ప్రముఖులు ఎన్ఎండీ ఫరూక్, శిల్పా మోహన్‌రెడ్డి, డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్, ఎందరో రాజకీయాలకు అతీతంగా హాజరయ్యారు. అలాగే మున్సిపల్ హైస్కూల్‌లో కాదరబాద్ నరసింగరావు కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



కాదరబాద్ నరసింగరావు కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

వారసత్వంగా రాజకీయాలను ప్రోత్సహించలేదు



మా నాన్న మమ్మల్ని రాజకీయాల వైపు ప్రోత్సహించలేదు. కేవలం సభలు, సమావేశాలకు నిర్వహణ బాధ్యతలను మాత్రం నేను చూసుకొనేవాడిని. అప్పట్లో పదవులు మనిషిని బట్టి వాటికవే వచ్చేవి. నిస్వార్థంగా ప్రజా సేవ చేసిన ఎందరో మహానుభావుల్లో మా నాన్న ఒకరు.

- డాక్టర్ రవీంద్రనాథ్, కాదరబాద్ నరసింగరావు ఐదో కుమారుడు, అంతర్జాతీయ పత్తి శాస్త్రవేత్త



ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఈవో

శ్రీశైలం, ఏప్రిల్ 30: శ్రీశైలం దేవస్థానం పరిధిలో దేవదాయ ధర్మాదాయ చట్టం నియమ నిబంధనల ప్రకారం 2024 ఎన్నికల్లో దేవస్థానం పరిధిలో చట్టాలను ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు రాజకీయ పార్టీలను హెచ్చరించారు. దేవదాయ చట్టం ప్రకారం ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలకు సంబంధించిన గుర్తులు, కండువాలు వేసుకుని దేవస్థానం పరిధిలోని ప్రధాన వీధుల్లో దుకాణాల వద్ద, సత్రాల వద్ద, కార్యాలయాల వద్ద ప్రచారం నిర్వహించడం పూర్తిగా నిషిద్ధమని ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక దేవస్థానంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ లేబర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పార్టీ నాయకులను కలవడం, ఫొటోలు దిగటం, ప్రచారంలో పాల్గొనడం జరిగినట్లు దేవస్థానం దృష్టికి వచ్చినట్లైతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దేవస్థానం మైక్ ద్వారా ఈ విషయాన్ని క్షేత్రపరిధిలో విస్తృతంగా ప్రచారం చేశారు.

సెక్షన్ 49(పీ)...

కర్నూలు, ఏప్రిల్ 30: ఎన్నికల పోలింగ్ రోజున దొంగ ఓట్ల వల్ల లేక ఇతర కారణాలతో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు తిరిగి దాన్ని సాధించుకునే హక్కును భారత ఎన్నికల సంఘం 1961లో తీసుకొచ్చిన సెక్షన్ 49(పి) అవకాశం కల్పిస్తోంది.

సెక్షన్49(పీ) ద్వారా ఓటు పొందాలనుకునేవారు ముందుగా ప్రిసైడింగ్ అధికారిని కలవాలి. ఓటు కోల్పోయిన వ్యక్తి మనమేనని ఆయన ముందు నిరూపించుకోవాలి. అందుకోసం ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. ఎన్ఆర్ఐలు అయితే.. పాస్‌పోర్టు చూపించాలి. అప్పుడు ప్రిసైడెంగ్ అధికారి ఇచ్చే ఫామ్ 17(బీ)లో పేరు, సంతకం చేసి ఇవ్వాలి.

అప్పుడు వెనుకవైపు తన సంతకంతో ఉన్న టెండర్డ్ బ్యాలెట్ పేపర్‌ను ప్రిసైడింగ్ అధికారి మనకు ఇస్తారు. దానిపై మనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి తిరిగి ప్రిసైడింగ్ అధికారికి ఇవ్వాలి. ఆయన ప్రత్యేక కవర్‌లో ఆ ఓటును భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. సెక్షన్ 49(పి) ద్వారా పొందే ఓటు హక్కును ఈవీఎం ద్వారా వేసేందుకు అనుమతి ఇవ్వరు. 49(పి) సెక్షన్ ద్వారా పొందే ఓటు హక్కును టెండర్డ్ ఓటు అని పిలుస్తారు. మొత్తం ఓట్లలో ఈ ఓటును అదనపు ఓటుగా గుర్తిస్తారు. కౌంటింగ్ రోజున మిగతా ఓట్లను లెక్కించిన తర్వాతనే ఈ ఓటుకు ప్రాధాన్యత ఉంటుంది. గెలుపు ఓటముల్లో ఈ ఓటు అవసరాన్ని బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ఓటు ద్వారా సాధ్యమవుతుందని భావించినప్పుడు మాత్రమే ఈ ఓటును లెక్కిస్తారు.

1909లోనే భారతీయులకు ఓటు హక్కు

శిరివెళ్ల, ఏప్రిల్ 30 : స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై భారతీయులు సాగించిన పోరాటాల్లో ఓటు హక్కు ఉద్యమం కూడా ఒకటి. నాటి పాలనలో అంతర్భాగమైన స్థానిక సంస్థలకు 1907లో నిర్వహించిన ఎన్నికల్లో భారతీయులకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమం సాగించారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ సిఫారసుల ఫలితంగా 1909లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ చట్టం ప్రకారం కొద్ది మంది భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. అప్పటి నుంచి కొనసాగిన ఉద్యమాలతో 1935లో ఓటు హక్కును విస్తృతం చేస్తూ భారతీయుల ఓటు హక్కు శాతాన్ని 10.6 శాతానికి పెంచారు. అనంతరం జరిగిన రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం ప్రజలకు ఓటు హక్కు వచ్చింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించాక ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి భారత రాజ్యాంగం 326 అధికరణ ప్రకారం 21 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు అమలు చేశారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయో పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది.



హ్యాట్రిక్ ఎంపీ ఎస్పీవై రెడ్డికి మరణానంతరం ఓటమి

● **15 సంవత్సరాలు వరుసగా పార్లమెంట్ సభ్యుడిగా రికార్డు**



నంద్యాల టౌన్, ఏప్రిల్ 30 : ఉమ్మడి జిల్లా నుంచి పార్లమెంట్‌కు ఎంతో మంది రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, వరుస విజయాలతో హ్యాట్రిక్ ఎంపీగా ఎస్పీవైరెడ్డి రికార్డు సాధించారు. 15 సంవత్సరాల పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన ఆయన చనిపోయాక పార్లమెంట్ ఎన్నికల్లో ఓడారు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో నంద్యాల ఎంపీ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ ఎస్‌పీవైరెడ్డి ఫలితాలకు ముందే మరణించారు. ఫలితాల్లో మూడో స్థానంలో నిలిచారు. నంద్యాల, కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి రాజకీయ ఉద్దండులు ఎంపీలుగా ఎన్నికై రాజకీయాల్లో రాణించారు. 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పీవీ రంగయ్య నాయుడుపై విజయం సాధించి మొదటి సారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపై భూమా నాగిరెడ్డి పోటీ చేసి రెండోసారి ఎంపీగా గెలుపొందారు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపైనే టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి పోటీ చేసి గెలుపొంది వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించినప్పటికీ 8 సంవత్సరా లు మాత్రమే భూమా నాగిరెడ్డి ఎంపీ పదవిలో ఉన్నారు.

చనిపోయాక ఓడిన ఎస్పీవైరెడ్డి..:

2004లో టీడీపీ అభ్యర్థి భూమా శోభానాగిరెడ్డిపై 1,11,679 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్పీవైరెడ్డి మొదటిసారిగా ఎంపీగా గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై 90,847 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి ఘన విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి వైసీపీలో చేరిన ఎస్పీవైరెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై 1,05,766 ఓట్లతో మూడోసారి ఎంపీగా గెలిచారు. హ్యాట్రిక్ సాధించిన ఎస్‌పీవైరెడ్డి గెలిచిన వారం రోజుల్లోపే సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019 సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ముందు వరకు టీడీపీలోనే ఎస్‌పీవైరెడ్డి కొనసాగారు. నంద్యాల సిట్టింగ్ ఎంపీగా తెలుగుదేశం టికెట్‌ను దక్కకపోవడంతో జనసేన గూటికి చేరారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాండ్ర శివానందరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పోచా బ్రహ్మానందరెడ్డిలకు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థిగా నంద్యాల పార్లమెంట్ బరిలోకి ఎస్‌పీవైరెడ్డి దిగారు.

అయితే పోలింగ్‌కు ముందు నుంచే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2019 ఏప్రిల్ 30వ తేదీన మృతి చెందాడు. ఆ ఎన్నికల ఫలితాలలో నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి 2,50,119 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో పోచాకు 7,20,888 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి మాండ్ర శివానందరెడ్డికి 4,70,769 ఓట్లు వచ్చాయి. హ్యాట్రిక్ ఎంపీగా జిల్లాలో చక్రం తిప్పిన ఎస్పీవైరెడ్డి (జనసేన)కి 38,871 ఓట్లు వచ్చాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఎస్పీవైరెడ్డి 15 సంవత్సరాలు పూర్తి కాలం పదవిలో ఉండి చివరిలో మరణానంతరం ఓడిపోయిన వ్యక్తిగా రాజకీయ పుటల్లో నిలిచారు.

ప్రచార వాహనాలకూ లెక్క చెప్పాల్సిందే..!



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 30: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇష్టానుసారంగా వాహనాల కాన్వాయ్ ఉపయోగిస్తే చర్యలు తప్పవని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ప్రచారానికి ఉపయోగించే వాహనాల లెక్క పక్కాగా చెప్పాల్సిందేనని ఎన్నికల చట్టం చెబుతోంది. ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికి సంబంధిత ఎన్నికల అధికారి నుంచి పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. పర్మిట్ పొందిన వాహనాల ఖర్చును అభ్యర్థి రోజువారీ లెక్కల్లో తప్పనిసరిగా చూపాల్సి ఉంటుంది. ఒకవేళ పర్మిట్‌లేని వాహనాన్ని ఉపయోగిస్తే అభ్యర్థి అనధికారికంగా ప్రచారం నిర్వహిస్తున్నాడని పరిగణిస్తారు. భారత శిక్షాస్మృతిలోని 9-ఏ నిబంధనల ప్రకారం అభ్యర్థిపై చర్యలు చేపడతారు. దీంతోపాటు ప్రచారం నుంచి సదరు అభ్యర్థిని తొలగిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఫలితాలు వెలువడిన 30రోజుల్లో ప్రచార వాహనాల ఖర్చుతో సహా, అభ్యర్థి ఖర్చులన్నీ రశీదులు, ఓచర్లతో సహా సమర్పించాల్సి ఉంటుంది. లేదంటే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 10ఏ నిబంధన కింద కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర చర్యలకు ఉపక్రమిస్తుంది. ఎన్నికైన తరువాత పదవి కోల్పోవడంతో పాటు, మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేకుండా నిషేధిస్తుంది.



ఓట్ ఫ్రమ్ హోమ్...

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 30: ఓట్ ఫ్రమ్ హోమ్ మీరు వినే ఉంటారు. గత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం దీనిని ప్రవేశపెట్టింది. గత సంవత్సరం తెలంగాణలో కూడా హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఈ నెల 13న ఎన్నికలు జరగబోతున్నాయి. అందువల్ల ఈ నెల 6 నుంచి 8 లోపు ముగించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

హోమ్ ఓటింగ్ అంటే: హోమ్ ఓటింగ్ అంటే ఇంటి నుంచే ఓటు వేయడం. 80 ఏళ్ల దాటినవారు, దివ్యాంగులు ఇంటి నుంచే బ్యాలెట్ విధానంలో ఓటు వేయవచ్చు. దివ్యాంగుల్లో 40 శాతం వైకల్యం ఉన్న వారు ఈ సదుపాయం పొందవచ్చు. ఈ విధానంలో వేసే ఓటు..బ్యాలెట్ బాక్సుల్లో ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ రోజు ఈ ఓట్లను కూడా లెక్కిస్తారు.

అర్హులు వీరే: ఓట్ ఫ్రమ్ హోమ్‌కు ముందుగా 12-డి ఫారం సమర్పించాలి. ఆ ఫారం సమర్పించిన వారు మాత్రమే ఇలా ఓటు వేయడానికి అనుమతి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికే ఎన్నికల సిబ్బంది వస్తారు. వచ్చే ముందు సమాచారం ఇస్తారు. ఆ రోజున ఓటు వేయాలనుకేనే వారు అందుబాటులో ఉండాలి. ఎన్నికల సిబ్బంది తమతో బ్యాలెట్ బాక్సును తీసుకు వస్తారు. అందులో ఓటు వేయవచ్చు. ఓటు ఎవరికి వేశామన్నది ఇతరులకు తెలిసే అవకాశం ఉండదు. మన ఇంటికి గెజిటెడ్ ఆఫీసర్, అసిస్టెంట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది వస్తారు. ఈ టీమ్ వచ్చినప్పుడు మీరు ఇంట్లో లేకపోతే, మరో రోజు కూడా ఇంటికి వచ్చేలా ప్లాన్ ఉంది. అయినప్పటికీ మొదటిసారి వచ్చినప్పుడే ఓటు వేసేలా ప్లాన్ చేసుకోవడం మంచిది.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవడానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోవాలన్నా, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందే దరఖాస్తు చేసుకున్నట్లయితే.. అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి వచ్చే ఓటరు 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకుని వచ్చే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థి వ్యయం రూ.40 లక్షలు మించరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి పాణ్యం నియోజకవర్గానికి బీ క్యాంపులోని బాయ్స్ స్కూల్లో 5, 6, 7, 8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

ఊసరవెల్లి రాజకీయం

- 2017లో ఎంవీఎస్ స్కీంకు అప్పటి ఎమ్మెల్యే బీవీ శంకుస్థాపన
- 2019 తరువాత నిధులను నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల వేళ భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



గాజులదిన్నె దగ్గర నిర్మాణ పనులు పూర్తయిన ఓహెచ్ఆర్ ట్యాంక్

గోనెగండ్ల, ఏప్రిల్ 30: వైసీపీ ఊసరవెల్లి రాజకీయానికి ఇదో నిదర్శనం. 2017లో ఎంవీఎస్ స్కీంకు అప్పటి ఎమ్మెల్యే బీవీ శంకుస్థాపన చేయగా 2019 వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపేసింది. ఓట్ల కోసమని మార్చి 13న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక హడావుడిగా భూమి పూజ చేపట్టారు. ఎవరిని మభ్యపెంటేందుకు ఈ భూమి పూజ పనులు చేపడుతున్నారో ప్రజలకు అంతుచిక్కడం లేదు. మండల పరిధిలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్టీవిలేజస్ స్కీం కింద 13.50 కోట్లు విడుదల చేసింది. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి 2017 ఏప్రిల్‌లో భూమి పూజ చేశారు. 2017 డిసెంబరు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పథకం కింద హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎర్రబాడు, కులుమాల గ్రామాల్లో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతో ఈ పథకానికి సంబంధించిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో హుటాహుటిన ఎంవీఎస్ స్కీంకు రూ. 19.50 కోట్లు నిధులు కేటాయించామని, 11 గ్రామాలకు అదనంగా మరో 3 గ్రామాలను చేర్చి 14 గ్రామాలకు నీరు అందించేందుకు గాను టెండర్ వర్క్‌పూర్తి అయిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మళ్లీ భూమి పూజ చేశారు.



2017లో మల్టీ విలేజస్ స్కీంకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే బీవీ(ఫైల్)

ఎన్ని సార్లు భూమి పూజ చేస్తారు



ఎంవీఎస్ స్కీం పనులకు గాను 2017లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. చాలా వరకు పనులు పూర్తి అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో నిలిచిపోయాయి. ఎన్నికలు వచ్చినందున వైసీపీ నాయకులు తాము ఏదో చేశామని చెప్పేందుకు మళ్లీ భూమి పూజ చేశారు. వైసీపీ నాయకులు ఎవరిని మోసం చేసేందుకు వస్తున్నారో అర్థం కావడం లేదు.

\- రామకృష్ణ, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, గాజులదిన్నె



2024 మార్చి 13న గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర మళ్లీ భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక



సగంలోనే నిలిచిపోయిన అప్పటి బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు

అయోమయంలో ఎన్నికల సిబ్బంది...!





కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరికీ పోస్టు బ్యాలెట్ అవకాశం కల్పించింది. ఈ మేరకు వారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. మే నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుంది. అత్యవసర సేవలకు సంబంధించిన వారికి మే నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించారు. జిల్లాలోని పీవోలు, ఏపీవోలకు రెండు శిక్షణా తరగతులను పూర్తి చేశారు. మే 1వ తేదీన సంబంధిత నియోజకవర్గంలో మూడో విడత శిక్షణా తరగతులను రిటర్నింగ్ అధికారి సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సిబ్బందికి మెసేజ్‌లు కూడా వచ్చాయి. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు దాదాపు 18వేలు దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది ఫారం-12, ఫారం-12డీ సంబంధిత ఆర్వో కార్యాలయంలో అందజేశారు. దరఖాస్తులు అందజేసిన తర్వాత అధికారులు ఎటువంటి రశీదు ఇవ్వలేదని ఎన్నికల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన దరఖాస్తు అంగీకరించబడినదా.. లేదా తిరస్కరణకు గురైందా అని ఎన్నికల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగీకరించబడిన దరఖాస్తు లు ఫోన్ నెంబర్లకు ఎటువంటి మెసేజ్‌లు కూడా రాలేదని ఎన్నికల సిబ్బంది చెబుతున్నారు. కానీ ఎన్నికల విధులకు మాత్రం కచ్చితంగా హాజరు కావాలని అధికారులు మెసేజ్‌లు పంపుతారని చెబుతున్నారు. ఇంతకూ తమ ఓటు హక్కు ఉందా లేదా అని ఎన్నికల సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆమోదం పొందబడిన దరఖాస్తుల ఫోన్ నెంబర్లకు మెసేజ్‌లు పంపాలని ఎన్నికల సిబ్బంది కోరుతున్నారు.

మీ బిడ్డల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ



మీ బిడ్డల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ అంటూ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ భరోసా ఇచ్చారు. మంగళవారం రాత్రి డోన్ నియోజకవర్గంలోని సిమెంటునగర్‌లో టీడీపీ అభ్యర్థి భర్త కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో చంటిబిడ్డను ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించారు. టీడీపీ జెండానే మీ బిడ్డల భవిష్యత్తుకు సురక్షితమని కోట్ల సుజాతమ్మ ఓటర్లకు తెలిపారు.

\- డోన్


నాడు డబ్బు సంస్కృతి లేదు

- కార్యకర్తలు ఇళ్ల నుంచే సద్ది తెచ్చుకునే వాళ్లు
- కమ్యూనిస్టులు కూడా గతి తప్పారు
- ఆలూరు మాజీ ఎమ్మెల్యే లోక్ నాథ్

ఆలూరు, ఏప్రిల్ 30:

'కమ్యూనిస్టుతో సహా ఇతర రాజకీయ పార్టీలు నిబద్ధతను కోల్పోయాయి. ఓట్లు, సీట్ల కోసం గతి తప్పి ప్రవర్తిస్తున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న జనం ఆర్థికంగా బలపడడానికి ఏమి చేయాలో ఆలోచించకుండా హామీలతో ఓట్ల కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.' అని ఆలూరు మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ అన్నారు. సాధారణ ఎన్నికల్లో ఆలూరు ఆసెంబ్లీ నుంచి 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన ఆయనను సోమవారం ఆంధ్రజ్యోతి పలకరించగా పలు ఆసక్తి కర విషయాలు వెల్లడించారు.

నాది ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం. నేను గోవాలో ఓ రెస్టారెంట్‌లో పని చేస్తుండే వాడిని. నన్ను 1989లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఆలూరు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు రూ.5 లక్షలు ఖర్చు అయింది. అప్పట్లో భోజనాలు, వాహనాలకు మాత్రమే డబ్బు ఖర్చు పెట్టేవాళ్లం. ఓటర్లకు డబ్బులు ఇచ్చే సంస్కృతి లేదు. రెండే రెండు జీపులు ప్రచారానికి వాడాం.. కార్యకర్తలు సైకిల్‌పై వచ్చి ప్రచారంలో పాల్గొనేవారు. సభలు సమావేశాలు ఉన్నప్పుడు కార్యకర్తలు



బస్సుల్లో ఇంటి దగ్గర నుంచే సద్దిమూట (అన్నం) తెచ్చుకునేవారు. ఇప్పుడు ఎన్నికలు చూస్తే డబ్బు లేని వాడు ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి. జనం ఓట్లు అమ్ముకుంటున్నారు. రాజకీయ పార్టీలు ఓట్లు కొంటున్నాయి. ఎన్నికల ఖర్చు రూ.కోట్లలో ఉంటోంది. ప్రభుత్వాలకు మద్యం అమ్మకాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందామే కానీ, రాజకీయంగా ఇంకా వెనకబడి ఉన్నామేమో అనిపిస్తుంది. డబ్బు, మద్యం ఎన్నికలను శాసిస్తున్నాయి. ఉద్యమ పార్టీలుగా చెప్పుకునే కమ్యూనిస్టులు కూడా ఒకటి, రెండు సీట్ల కోసం బూర్జువా పార్టీల చెంతన చేరే పరిస్థితి ఏర్పడింది. మేధావులు, విద్యావంతులు, యువకులు, మహిళలు, విద్యార్థులు ఈ విషయంలో ఒక ఆలోచనకు రావాలి. సామాజికంగా చైతన్యం వస్తే తప్ప మార్పు రాదు. పత్రికలు, సీనియర్ జర్నలిస్టులు ప్రజలకు మేలు చేకూరే అంశాలపై ఫోకస్ చేయాలి.. ఎమ్మెల్యేగా గెలిచాక హామీలను, ప్రజాసేవను పక్కన పెట్టి కోట్ల రూపాయలు సంపాదనే ధ్యేయంగా ఎమ్మెల్యేలు తమ స్వార్థాన్ని చూసుకుంటున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సేవ తప్ప డబ్బు సంపాదన ఆలోచన లేదు. ఎమ్మెల్యేగా పని చేసినా సొంత ఇల్లు, కారు కూడా సంపాదించ లేదు. ప్రజలకు సేవ చేస్తే ఆ ఎమ్మెల్యేను ప్రజల గుర్తించుకుంటారు..

మొదలైన ప్రలోభాల పర్వం

- ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్న కార్యకర్తలు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న అభ్యర్థులు
- కాల్ చేసి విజ్ఞప్తి చేసేందుకంటూ వివరణ
- వేర్వేరు నెంబర్ల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్



ఆదోని, ఏప్రిల్ 30: ఇన్నాళ్లు ఒక ఎత్తు.. ఈ 13 రోజులు మరో ఎత్తు అన్నట్టుగా ఎన్నికల ప్రచారం మారింది. ఎన్నికల బరిలో ఉన్న నాయకులు ఓటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రచారం తుది దశకు చేరుకున్న తరుణంలో పోల్ మేనేజ్ మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే కాల్స్ ద్వారా ఓటర్లను పలకరిస్తున్నారు.

● మొబైల్ నంబర్‌ల సేకరణపై దృష్టి..

మొబైల్ నెంబర్ల సేకరణపై భిన్న ప్రచారాలు జరుగుతున్నాయి. నగదు బదిలీ కోసం కొందరు వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగదు పంపిణీ క్రమంలో ప్రత్యర్థి పార్టీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వైలెన్స్ టీంలతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ఎలాంటి రిస్క్ లేకుండా ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో కొందరు అభ్యర్థులు ఉన్నట్టు తెలిసింది. ఆదోని నియోజకవర్గంలోని ప్రధాన పార్టీకి చెందిన కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు పర్యటించారు. ఓటు వేయాలని విజ్ఞప్తి కంటే ఇంటింటికీ వెళ్లి ఓటర్ల మొబైల్ నెంబర్ల సేకరణపై వారు ఎక్కువ దృష్టి సారించారు. యూపీఐ లావాదేవీల పైనా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. ఒక నెంబరు నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే... వేర్వేరు వ్యక్తుల యూపీఐ ఖాతాల ద్వారా నగదు బదిలీకి చర్యలు తీసుకుంటున్నారు. పలు ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ఏరియాల్లో స్థానికంగా గుర్తు పట్టని వ్యక్తుల ద్వారా పంపిణీ చేపడుతున్నారు.

● ప్రలోభాల పర్వంపైనే సన్నిహితులతో చర్చ...

ఏ ప్రాంతంలో ఎంత పంచాలనే దానిపై అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. ప్రచారం అనంతరం రాత్రి వేళ ప్రలోభాల పర్వంపైనే సన్నిహితులతో చర్చిస్తున్నారు. నియోజక వర్గంలో ఓటుకు రూ.వెయ్యి, మరి కొన్ని నియోజకవర్గాల్లో రూ.2 వేల వరకు ఇవ్వనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఆ కాలనీ ముఖ్య నాయకుడు ద్వారా ఇప్పటికే చెల్లింపులు మొదలైనట్లు తెలిసింది.

● నిఘా పెంచిన పోలీసులు

ఇతర ప్రాంతాల నుంచి డబ్బు తరలే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. కోడ్ ఎన్నికలకు ముందున్న ఈ 15 రోజులు నిఘా పెంచి డబ్బు, మద్యం తరలింపనకు కళ్లెం వేయడానికి సిద్ధమయ్యారు. అనుమానిత కేంద్రాలు, జిల్లా సరిహద్దుల వద్ద మరింత బందోబస్తు చేపట్టారు. రూట్‌లో వెళ్లే వాహనాలన్నీ చెక్ చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

జగన్.. ఇచ్చిన హామీ మరిచావా ?

- ఓట్లు తప్ప ప్రజల కష్టాలు పట్టవా
- గోరంట్ల-కొత్తపల్లి బ్రిడ్జి నిర్మాణం ఏమైంది..!
- గెలిచిన నాలుగేళ్లకు టెంకాయ కొట్టిన మంత్రి బుగ్గన
- బిల్లులు పెండింగ్‌తో పనులు ఆపేసిన కాంట్రాక్టర్





పూర్తికానిగోరంట్ల - కొత్తపల్లి గ్రామాల మధ్య వంతెన పనులు

కోడుమూరు, ఏప్రిల్ 30: జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మారిచావా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 40 గ్రామాల ప్రజలకు రాకపోకలు కొనసాగే విధంగా కోడుమూరు మండలం గోరంట్ల కొత్తపల్లి హంద్రీనదిపై వంతెన నిర్మాణం చేపడతానని 2017 డిసెంబరు 25న పాదయాత్రలో సాక్షాత్తు జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ఓట్ల కోసం వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల అనంతరం 2023 జనవరి 24న గోరంట్ల, కొత్తపల్లి వంతెన నిర్మాణమంటూ ఎంతో ఆర్భాటంగా రాష్ట్ర మంత్రి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎంపీ సంజీవ్‌కుమార్ పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు శ్రీదేవి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అందరు కలిసి టెంకాయకొట్టి పనులను ప్రారంభిచారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అంటూ సదరు కాంట్రాక్టర్ ఎంతో ఉల్లాసంగా పనులు చకచకా చేపట్టారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేసి వంతెన నిర్మాణం కోసం 19 పిల్లర్లు నిర్మించారు. అదిగో బిల్లు ఇదిగో అంటూ సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌ను ఊరించారు. ఏడు నెలలు బిల్లుల కోసం ఎదురు చూశాడు. కానీ ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ రాలేదు. దీంతో బిల్లు వస్తే తప్ప పనులు చేయలేనని కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. 2023 ఆగస్టులో పనులను నిలిపివేసిన సదరు కాంట్రాక్టర్ ఇంత వరకు పనుల వైపు తొంగి చూడలేదు.

జగన్ ఇచ్చిన హామీకే నిధుల కొరత :

కోడుమూరు మండలం గోరంట్ల - కొత్తపల్లి గ్రామాల హంద్రీనదిపై హైలెవల్ వంతెన నిర్మాణం అలాగే హంద్రీ నుంచి కొత్తపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.21 కోట్లు నిధులను విడుదల చేసింది. టెండర్ ప్రక్రియను వైఎంఆర్ కన్స్ట్రక్షన్ సంస్థ చేజిక్కించుకుంది. పీఐయూ పర్యవేక్షణలో ఎంతో వేగవంతంగా పనులను ప్రారంభించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ యంత్రాలను వదిలేసి కాంట్రాక్టర్ తట్టాబుట్ట సర్దుకొని పరార్ అయ్యాడు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామికే నిధుల కొరత అంటూ ప్రజలు ప్రజలు వైసీపీ ప్రభుత్వం విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్

వైసీపీ ప్రభుత్వాన్ని నమ్ముకొని సదరు కాంట్రాక్టర్ గోరంట్ల-కొత్తపల్లి వంతెనతో పాటు కోడుమూరు నియోజకవర్గంలోని సుంకేసుల-కర్నూలు రోడ్డు, ముడుమలగుర్తి, బుడిదపాడు, గొందిపర్ల, బ్రహ్మణదొడ్డి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సమాచారం. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసినా ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ భారీ ఎత్తున నష్టపోయినట్లు తెలిసింది. బిల్లుల కోసం కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించి కొంత డబ్బును రాబట్టుకున్నట్లు సమాచారం.

టీడీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి: ఫరూక్



మాట్లాడుతున్న ఎన్‌ఎండీ ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 30: టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా ఒంటివెలగల, ఎం.చింతకుంట్ల గ్రామాల్లో పర్యటించారు. ఫరూక్ మాట్లాడుతూ ఒంటివెలగల గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకులు మల్లికార్జున, సురేంద్ర, నాగేశ్వరరావు, మరో పది మంది యువకులు టీడీపీలో చేరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగ ఉత్తేజ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు: శబరి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 30: రోజురోజుకు టీడీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండంతో వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు పుడుతోందని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. టీడీపీ, జనసేన కూటమి సమన్వయకర్త పిడతల సుధాకర్, పబ్బతి రవి ఆధ్వర్యంలో నంద్యాలలోని 4వార్డుకు చెందిన వైసీపీ నాయకులు 300 కుటుంబాలతో టీడీపీలో చేరారు. 4వార్డు తోటలైనులో ఏర్పాటు చేసిన సభలో శబరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 30: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ అన్నారు. మంగళవారం 21వవార్డు టీడీపీ నాయకుడు పట్నం సాల్మన్ ఆధ్వర్యంలో 21, 28, 29వ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తులసిరెడ్డి, ఎన్‌ఎండీ ఫిరోజ్‌తో పాటు కూటమి నంద్యాల సమన్వయకర్త పిడతల సుధాకర్ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలోని సమస్యలు, నాయకుల దృష్టికి తీసుకరావడంతో ఇదేనా వైసీపీ పాలన అంటూ విమర్శించారు. టీడీపీ, జనసేన నాయకులు నగేష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో వైసీపీ మహిళా నేత రహస్య సమావేశం

నంద్యాల రూరల్, ఏప్రిల్ 30: నంద్యాల జిల్లా కేంద్రం మంగళవారం జగన్నాటకానికి వేదిక మారింది. ప్రముఖ హోటల్ ఇందుకు కేంద్ర బిందువైంది. వైసీపీకి చెందిన ఓ కీలక మహిళా నేత వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి గెలుపునకు సహకరించాలని తనదైన శైలిలో వలంటీర్లను ప్రోత్సహించారు. ఈసీ నిబంధనల నేపథ్యంలో సదరు కీలక మహిళా నేత అత్యంత గోప్యంగా నిర్వహించారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

ఆత్మకూరు, ఏప్రిల్ 30: శ్రీశైలం నియోజకవర్గంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచిన 18 మందికి గుర్తులను కేటాయిస్తూ మంగళవారం రిటర్నింగ్ ఆఫీసర్ రిపోర్టు-7 పత్రాన్ని విడుదల చేశారు. ఇందులో జాతీయ, రాష్ట్ర పార్టీలకు ప్రాధాన్యత క్రమాన్ని పాటించి ఇండిపెండెంట్లకు చివర్లో స్థానం కల్పించారు. బీ-ఫారమ్స్ సమర్పించిన వారికి పార్టీ సింబల్స్, రిజిస్టర్ పార్టీలకు వారి పార్టీ గుర్తులతో పాటు ఇండిపెండెంట్లకు గుర్తులను కేటాయించారు.

ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు: డీఎస్పీ

కొత్తపల్లి, ఏప్రిల్ 30: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేస్తే.. అలాంటి నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం దుద్యాల, శివపురం గ్రామాల్లో శాంతిభద్రతల చర్యల్లో భాగంగా ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్‌ఐ హరిప్రసాద్, బీఎస్‌ఎఫ్ డీఎస్పీతో పాటు సిబ్బందితో పాటు ఆయా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. డీఎస్పీ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను మద్యం, డబ్బుతో ప్రభావితం చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

'నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి'

పాణ్యం, ఏప్రిల్ 30: పిన్నాపురం గ్రామంలోని సోలార్ పరిశ్రమ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాత, ముత్తాతల కాలంనుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పరిహారం ఇవ్వకపోగా దౌర్జన్యంగా భూములు లొక్కొని పరిశ్రమ పనులు చేసుకోవడం అన్యాయమన్నారు. రైతులకు, పరిశ్రమ యాజమాన్యానికి మధ్య రాజకీయ నాయకులు చొరబడి కమీషన్‌లకు కక్కుర్తిపడి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ భూముల సాగులో ఉండే రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉండగా బినామీ పేర్లతో పిన్నాపురం భూముల్లోకి ఇతరులు చొరబడి కొందరు అవినీతి రెవెన్యూ అధికారుల అండతో ఆన్‌లైన్ చేసుకొని కంపెనీకి భూములను అప్పజెప్పి పరిహారం కాజేస్తున్నారన్నారు. జీవనాధారమైన భూములకు ఇప్పటికే అడ్వాన్స్‌గా కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొని భూముల్లో పనులు చేస్తుండడంతో రైతులు కడుపు మండి పనులను అడ్డగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. 212 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూములకు సోలార్ కంపెనీ పరిహారం ఇచ్చి భూముల్లో కాలుపెట్టాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు



అల్లూరులో మాండ్ర ఇంటి వద్ద టీడీపీ అధినేత చంద్రబాబుతో నాయకులు



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 30: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నందికొట్కూలో ప్రజాగళం అనంతరం సోమవారం రాత్రి అల్లూరు గ్రామానికి చేరుకున్నారు. అక్కడ టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఇంటి వద్ద బస చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్థులు, యువతతో సమావేశమైన అనంతరం బయలుదేరి వెళ్లారు. మాండ్ర ఇంటి వద్ద పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి శివానందరెడ్డి, ఉమాదేవి దంపతులతో పాటు నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, మాండ్ర లింగారెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద నాయకులు అధినేత చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికుడినే గెలిపించుకుందాం: మాండ్ర

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 30: నందికొట్కూరు నియోజకవర్గంలో సమస్యలు తీరాలంటే స్థానికుడైన గిత్తా జయసూర్యను గెలిపించుకోవాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నందికొట్కూరు చంద్రబాబు పర్యటనను విజయవతం చేసిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు మాండ్రతో పాటు అభ్యర్థి గిత్తా జయసూర్య కృతజ్ఞతలు తెలిపారు. మాండ్ర మాట్లాడుతూ దాదాపుగా 70 వేల మంది దళితులలో ఒక్కరూ కూడా సిద్దార్థరెడ్డికి సమర్థులు కనిపించలేదా? అని ప్రశ్నించారు. నందికొట్కూరు నియోజకవర్గంలో స్థానికేతరుడైన ధారా సుధీర్‌కు వైసీపీ టికెట్ ఇచ్చారని, అయితే ఆయన గెలిచినా ఇక్కడ ఉండరని అన్నారు. మళ్లీ సిద్దార్థ రెడ్డి రాజకీయ పెత్తనం కొనసాగిస్తారని అన్నారు. ఆర్థర్ ఎమ్మెల్యే అయినా ఆయనకు పవర్ ఇవ్వకుండా అవమానించిన విషయం ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. ఈసారి ఆర్థర్ టికెట్ రాకుండా ఎక్కడో హైదరాబాదులో ఉన్న ధారా సుధీర్‌కు టికెట్ ఇచ్చి తీసుకొచ్చారని అన్నారు. మరోసారి నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని అన్నారు. టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య స్థానికుడు అని, ఇక్కడే అందరికీ అందుబాటులో ఉంటారని అన్నారు. ప్రజలు తమ సమస్యలను జయసూర్య ఎల్లప్పుడూ చెప్పుకోవచ్చన్నారు. టీడీపీ హయాంలో నందికొట్కూరు నియోజకవర్గంలో దాదాపుగా ఆరు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి సాగు, తాగు నీరును అందించామన్నారు. వైసీపీ ప్రభుత్వం అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కనీసం మరమ్మతులు చేయించలేక దాదాపు 200 మత్స్యకార, రైతు కుటుంబాలకు అన్యాయం చేశారన్నారు. వారంతా పనులు లేక వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయించి, మిడుతూరు ఎత్తిపోతలను కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, నారపురెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం అల్లూరు గ్రామంలో మాండ్ర, గిత్తా జయసూర్య సమక్షంలో కొత్తపల్లె మండల టీడీపీ నాయకుడు నారపురెడ్డి ఆధ్వర్యంలో నాగంపల్లె గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కరీముల్లా యాదవ్, నాగంపల్లె సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జమ్ములయ్య యాదవ్ ఉన్నారు.

మిడుతూరు: బాబు సూపర్ సిక్స్ పథకాలు సూపర్ అని టీడీపీ నంద్యాల లోక్ సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని కడుమూరు గ్రామంలో మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఇద్రుశ్, సుధాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మాండ్ర శివానంద రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య బాబు సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వర రెడ్డి, మబ్బులు, భాస్కర్, నిసార్, షఫీవుల్లా, ఇబ్రహీం పాల్గొన్నారు.



కడుమూరు గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం: బుడ్డా



బండి ఆత్మకూరు: మాజీ వైస్ ఎంపీపీకి కండువా కప్పుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు: మహిళలతో బుడ్డా రాజశేఖర్ రెడ్డి సతీమణి శైలజ

బండిఆత్మకూరు, ఏప్రిల్ 30: టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని శ్రీశైలం అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం, జీసీ పాలెం, చిన్న వనం, సోమయాజులపల్లె ఈర్నపాడు, పడమట కాల్వ, వెంగళరెడ్డి పేట, బికోడూరు గ్రామాల్లో మంగళవారం బుడ్డా రోడ్ షో నిర్వహించారు. బుడ్డా ప్రసంగిస్తూ తెలుగు గంగ కాలువ నిర్మించింది టీడీపీ అని, నేడు నల్లమల గ్రామ తీరాలన్ని పాడి పంటలతో సస్యశ్యామలం గా ఉన్నాయంటే స్వర్గీయ నందమూరి తారకరామారావు పుణ్యమేనని అన్నారు. ఓంకారం దేవస్థానం రోడ్డుకు టీడీపీ హయాంలో తాను రూ.17 కోట్లు మంజూరు చేయిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బలవంతంగా ఆ పనులను తన అనుచరులకు ఇప్పించారని ఆరోపించారు. ఐదేళ్లయినా రోడ్డు పనులు గుంతలతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మార్చారని అన్నారు. తాను చేసిన అభివృద్ధిని శిల్పా సిగ్గు లేకుండా తాను చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీసీ పాలెంలో వర్దన్‌బ్యాంకు బాధితుడు దళిత రాము అనే వ్యక్తి రూ.5 లక్షలు డిపాజిట్ చేసి మోస పోయానని బుడ్డా ఎదుట వాపోయారని గుర్తుచేశారు. తమకు ఇచ్చింది కొంత అయితే రోడ్ల వెంట పోలీసులతో ఆటోలను ఆపి జగన్ రెట్టింపు లాగారని సింగవరంలో ఓ ఆటో డ్రైవర్ బుడ్డా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శశాంక్ రెడ్డి, సురేష్ రెడ్డి, నరసింహారెడ్డి, చిన్న లింగారెడ్డి, శోభారాణి, శ్రీనివాసులు, సుబ్బలక్ష్మయ్య, రామసుబ్బయ్య, కలాం, మల్లికార్జున, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని ఎరుకల కాలనీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ మల్లు రాజారెడ్డి బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు సోదరుడు చంద్రహాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు మరో ఆరు కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే సోమయాజుల పల్లె గ్రామంలో నారపు రెడ్డి, మరో 5 కుటంబాలు వైసీపీని వీడి బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి.

ఆత్మకూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల కష్టాలను తీర్చే నాయకులను ఎన్నుకోవాలని బుడ్డా శైలజ అన్నారు. పట్టణంలోని నవతా ట్రాన్స్‌పోర్టు ఏరియా, రఘునాథ్‌సెంటర్, ఆసర్ మసీద్ ఏరియా, అక్కిరాజుకాలనీ, కప్పలకుంట, రహమత్‌నగర్ కాలనీల్లో మహిళలతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ.. 40ఏళ్లకు పైగా బుడ్డా కుటుంబం ఇక్కడి ప్రజలతో మమేకమై సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి అనేక పర్యాయాల్లో ఇక్కడి ప్రజలు తమను ఆదరించారని అన్నారు. ఈక్రమంలోనే తన భర్త ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శ్రీశైల నియోజకవర్గాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత వైసీపీ పాలనతో నియోజకవర్గంలో అన్నివిధాలుగా వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

● పట్టణంలోని 3వ వార్డుకు చెందిన షేక్‌అబ్దుల్ మాలిక్, సయ్యద్ ఉమ్మర్, షేక్ జాకీర్, షాషావలి, నూర్, షఫీవుల్లా, కలీముల్లా తదితరులు బుడ్డా శైలజమ్మ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు షాలీఫైల్వాన్, నగేష్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం: శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి కుమార్తె మేఘన రెడ్డి మంగళవారం సుండిపెంటలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. శ్రీశైలం మండలం అభివృద్ధి కావాలంటే బుడ్డా రాజశేఖరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మేఘనారెడ్డి, సాయి జయంత్ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు వివరించి వారి మద్దతును కోరారు.



సుండిపెంటలో ప్రచారం చేస్తున్న మేఘన రెడ్డి

ముగిసిన సాంకేతిక సదస్సు

పాణ్యం, ఏప్రిల్ 30: మండలంలోని ఆర్జీఎం కళాశాలలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక సదస్సు మంగళవారం ముగిసిన ట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రీసెంట్ అడ్వాన్స్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన రీసర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో వివిధ అంశాలలో పాల్గొన్న స్కాలర్స్‌కు మెమొంటోలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, కన్వీనర్ డాక్టర్ సునందనరెడ్డి, స్టూడెంట్స్ డీన్ రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా మంచినీరు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 30: నంద్యాలలోని 19వ వార్డు పొన్నాపురం కాలనీ 9వ లైనులో రెండు నెలలుగా మంచి నీటి ఎద్దడి ఏర్పడడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించి ఇమ్మానియేల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మంచి నీటి సరఫరా కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం ఫౌండేషన్ ట్రస్టు ఫౌండర్ డాక్టర్ ఇమ్మానియేల్ నీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడితో తోపుడు బండ్లు, సైకిళ్లు, ద్విచక్రవాహనాలు, మహిళలు కాలినడకతో దూరప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితులు, వారి ఇబ్బందులను గుర్తించి నిర్ణయం తీసుకున్న ట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5:30 గంటలనుంచి 6:.30 గంటల వరకు నీటి సరఫరా అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టస్టు చైర్మన్ ప్రభ ఇమ్మానియేల్, మేనేజింగ్ ట్రస్టు రత్న పాల్గొన్నారు.

పాములపాడులో ప్రచారం

పాములపాడు, ఏప్రిల్ 30: పాములపాడులో టీడీపీ నాయకులు గోవిందు, మధుక్రిష్ణ, వెంకటేశ్వరరావు, మద్దిలేటి, జలాల్‌బాషా, ఉస్మాన్‌బాషాలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పగిడ్యాల, ఏప్రిల్ 30: మండల పరిధిలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల ప్రత్యేకాధికారి పంకజ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ముచ్చుమర్రి గ్రామంలో 91వ పోలింగ్ కేంద్రంలో ర్యాంప్ ఎర్పాటు చేయకపోవడం పై సెక్టోరియల్ అధికారి సంజన్న అగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులలోపు ర్యాంపు పనులు చేపట్టాలని సూచించారు. 93వ పోలింగ్ కేంద్రంలో కిటికీలు ఉడిపోవడంతో బీఎల్‌వో జావిద్‌ను మందలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసు, ఆంజనేయులు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

పాణ్యం, ఏప్రిల్ 30: మండలంలోని గోనవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందగా ఇద్దరికి గాయాలైనట్లు పాణ్యం ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఈనెల 29వ తేదీన అవుకు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శ్రీరాముల అన్నమయ్య, చెల్లెలుమానస (18), భార్య సులోచనలు మోటారు సైకిల్‌పై నంద్యాలకు వెళ్తుండగా గోనవరం వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో అన్నమయ్య, సులోచనకు తీవ్రగాయాలు కాగా మానస తలకు బలమైన గాయాలు కావడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించి నట్లు తెలిపారు. మానస పరిస్థితి విషమించడంతో శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు మృతురాలి తండ్రి బాలగురప్ప పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు

'దుర్మార్గ పాలనను సాగనంపండి'



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చాగలమర్రి, ఏప్రిల్ 30: రాష్ట్రంలో దుష్ట పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం చాగలమర్రి, ఆళ్లగడ్డ పట్టణాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి వివరించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. పన్నుల భారం మోపి, విద్యుత్ చార్జీలను పెంచిన ప్రభుత్వానికి స్వస్తి పలకాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి: వైద్యాధికారి

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 30: ఆత్మకూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అహ్మద్‌భాష, ఆరోగ్య కార్యకర్త, స్వర్ణలత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బుడ్డా ప్రసంగానికి అడ్డు తగిలిన వైసీపీ నాయకులు

● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



సోమయాజుల పల్లెలో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 30: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సోమయాజుల పల్లె గ్రామంలో టీడీపీ, వైసీపీ మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. మంగళవారం బుడ్డారాజశేఖరరెడ్డి, సోమయాజుల పల్లెలో ప్రసంగిస్తూ వైసీపీ చేసింది ఏమీ లేదని నవరత్నాలు ఎక్కడో చూపించాలంటూ బుడ్డా ప్రశ్నించారు. ఈ సమయంలో సమీపంలో ఉన్న వైసీపీ నాయకుడు చక్రపాణి, తిరుపతయ్య, శ్రీను, ఎంపీటీసీ రామయ్య పథకాలు అందాయో లేదో వైసీపీ కుటుంబాలను అడగాలన్నారు. దీంతో బుడ్డా స్పందిస్తూ సభా వేదికపైకి వచ్చి ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ క్రమంలో టీడీపీ వైసీపీ నాయకుల మధ్య కొంత వాగ్వాదం నెలకొంది. అక్కడే ఉన్న స్థానికులు, పోలీసులు ఇరువర్గాలను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె



సిమెంట్‌నగర్‌లో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు అండగా ఉంటాం

కోట్ల దంపతులు

బేతంచెర్ల, ఏప్రిల్ 30: సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు అండగా ఉంటామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు అన్నారు. మంగళవారం సాయంత్రం బుగ్గానిపల్లె తాండా, బుగ్గానిపల్లె, సిమెంటునగర్ గ్రామాల్లో మండల అధ్యక్షుడు ఉన్నం ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ రెడ్డి, భీమేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిక

ప్యాపిలి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన 30 మంది వైసీపీ వర్గీయులు మంగళవారం డోన్‌లో టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. డోన్ మార్కెట్ చైర్మన్ రాజా నారాయణమూర్తి ఆధ్వర్యంలో వారంత పార్టీ తీర్థం తీసుకున్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని కోట్ల భరోసా ఇచ్చారు.

పుంగనూరు ఎన్నికల సమన్వయకర్తగా సుబ్బారెడ్డి



డోన్, ఏప్రిల్ 30: చిత్తూరు జిల్లాలోని పుంగనూరు అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్తగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డిని నియమించారు. టీడీపీ అధినేత చంద్ర బాబు ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, డోన్ నియోజకవర్గానికి చెందిన సుబ్బారెడ్డిని పుంగనూరు ఎన్ని కల సమన్వయకర్తగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. చంద్ర బాబు ఏ బాధ్యతలు అప్పగించినా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని సుబ్బారెడ్డి తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

బనగానపల్లె/ అవుకు ఏప్రిల్ 30: బనగానపల్లె పట్టణంలోని కొంపేటకు చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త కార్పెంటర్ జాకీర్ (50) మృతి చెందడంతో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు బీసీ రాజా రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎం. సుధాకర్ (56) మృతి చెందడంతో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, అవుకు మండలం టీడీపీ నాయకుడు మోట్ల రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు నివాళులర్పించారు. అలాగే బనగానపల్లె పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త ఈసారి ఎల్లయ్య ఇటీవల గుండె శస్త్రచికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బీసీ జనార్దనరెడ్డి ఎల్ల య్యను పరామర్శించారు.

కొలిమిగుండ్లలో టీడీపీ ప్రచారం

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 29: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో టీడీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి నేతృత్వంలో పట్టణంలోని మసీదు కాలనీ, ఎస్సీ కాలనీ, నాయినిపల్లె రహదారి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫేస్టోపై ప్రజలకు వివరించి, ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చికెన్ వెంకటేషు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, గూడురు నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ సీతారామయ్య, ఉలువల నరసింహుడు, అందె రాము, బీగాల శివ, న్యాయవాది విజయ్, బుగ్గ రాముడు, ఎమ్మార్పీస్ దస్తగిరి, భాషా, జనసేన నాయకులు పెద్దయ్య, నాగేశ్వరరెడ్డి, ప్రసాదు, మద్దిలేటి పాల్గొన్నారు.

డోన్ బరిలో 16 మంది అభ్యర్థులు

డోన్, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నిల నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో డోన్ అసెంబ్లీ బరిలో మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తులను కేటాయించారు. డోన్ టీడీపీ అభ్యర్థిగా కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటి స్వామి, వైసీపీ అభ్యర్థిగా బుగ్గన రాజారెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా జి.రాముడు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా టి.బాలుయాదవ్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా బలపాల కుమారస్వామితోపాటు మరో పది మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు.

కుక్క కరిచిందని వ్యక్తి ఫిర్యాదు

మహిళపై కేసు నమోదు

రుద్రవరం, ఏప్రిల్ 30: మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన గంధం సురేఖకు చెందిన కుక్క తనను కరిచిందని దేవగుడి రసూల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహిళపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా

- పడమటిపల్లెలను ఆదుకుంటా
- నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా
- బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 30: నియోజకవర్గంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కచ్చితంగా అమలు చేస్తానని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. తాను కాటసాని రామిరెడ్డిలా మాట తప్పే వ్యక్తిని కానని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని ప్రజలకు భరోసానిచ్చారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని పసుపల, పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు. గతంలో కూడా పడమటిపల్లెల ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి తాను రూ.22 కోట్లతో దద్దనాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేసి నీటిని మళ్లించానన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పొలాలకు రస్తాలు వేశామన్నారు. తాను గెలిచిన వెంటనే పసుపల నుంచి గుండం మల్లికార్జున స్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు వేయిస్తానని, పసుపల చెరువును నీళ్లతో నింపుతానని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ హయాంలో జరిగింది శూన్యమన్నారు. నవరత్నాలు అంటూ గొప్పలు చెబుతున్న వైసీపీ నవ మోసాలు చేసిందన్నారు. అమ్మఒడి ఇద్దరి పిల్లలకు ఇస్తామని చెప్పి ఒకరికే ఇచ్చి దారుణంగా మోసం చేసిందని, అందులో కూడా 2 వేలు తగ్గించి తల్లిదండ్రులను వంచించిందన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి యువతను నట్టేట ముంచిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూషన్న, బాలనాయుడు, షేక్షావలి, శేకన్న, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, శంకేశ్వరరెడ్డి, చిన్నస్వామి, బత్తుల బాలిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, కుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దస్తగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత: బీసీ క్షీరారెడ్డి



టీడీపీ పథకాలపై మహిళలకు వివరిస్తున్న బీసీ క్షీరారెడ్డి

కొలిమిగుండ్ల రూరల్: తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలంలోని తోళ్లమడుగు గ్రామంలో మామ గెలుపు కోసం ఆమె పచారం నిర్వహించారు. టీడీపీ అధికారం లోకి వస్తే అమలు చేయబోయో ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, బీసీ వర్గాలకు 50ఏళ్లకే పింఛన్, తల్లికి వందనం, మెగా డీఎస్సీ, నిరుద్యోగభృతి తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయ కులు, మహిళలు పాల్గొన్నారు.



ఓత్రమానుదిన్నె రోడ్‌షోలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

కూటమి మేనిఫెస్టో ప్రజలకు వరం

సంజామల: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన కూటమి మేనిఫెస్టో ప్రజలకు వరంలాంటిదని బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని వసంతాపురం, బొందెలదిన్నె, ఓత్రమానుదిన్నె, నట్లకొత్తూరు, గ్రామాలలో జరిగిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. జగన్ పాలనలో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలకు త్వరలో చంద్రబాబు సుస్థిర పాలనను అందజేయనున్నామని వెల్లడించారు. ఇకపై చెత్తపన్ను, నీటి పన్ను, బాదుడులాంటివి ఉండవన్నారు. కార్యక్రమంలో కమలపురి సర్పంచ్ విజయలక్ష్మి, నల్లగట్ల చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, డీలర్ చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, శేఖర్, అజారత్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి 29 కుటుంబాలు

బనగానపల్లె: అవుకు మండల టీడీపీ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చెర్లోపల్లెకు చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి మంగళవారం టీడీపీలో చేరాయి. అలాగే అవుకు మండలం మంగంపేటకు చెందిన 14 కుటుంబాలు శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పసుపు కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి



చంద్రబాబు రాకతో టీడీపీలో ఉత్సాహం

డోన్, ఏప్రిల్ 30: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాకతో డోన్ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి సోమవారం జరిగిన చంద్రబాబు సభను విజయవంతం చేశారు. డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. మంత్రి బుగ్గనపై చంద్రబాబు నిప్పులు చెరగడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. అంతేగాక ధర్మవరం సుబ్బారెడ్డికి న్యాయం చేసే బాధ్యత తనదేనని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు నియో జకవర్గంలో టీడీపీ బలం మరింతగా పెంచేందుకు చంద్రబాబు పర్యటన దోహద పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ కూటమి డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని వ్యూహాత్మకంగా చంద్రబాబు పోటీల్లో నిలిపారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం డోన్ కావడంతో చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. దశాబ్దాలుగా డోన్ నియోజకవర్గ ప్రజలతో సంబంధాలు ఉండటంతో.. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పట్టు బిగించారు. కేఈ వర్గం, ధర్మవరం సుబ్బారెడ్డి వర్గాలను కోట్ల సమన్వయం చేస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. తన భర్త కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపు కోసం కోట్ల సుజాతమ్మ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అసంతృప్తిదారులను తమ వైపు తిప్పుకుంటూ టీడీపీలో చేరేలా ఆమె పావులు కదుపుతున్నారు. ఆమెకు తోడు కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కూతుర్లు కోట్ల నివేదిత, కోట్ల చిత్రమ్మ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ఇది టీడీపీకి ఎంతో కలిసి వస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డోన్‌లో చంద్రబాబు సభకు పోటెత్తిన జనం

కోడ్ ఉల్లంఘనను పట్టించుకోని అధికారులు



గుల్లదుర్తిలో శిలాఫలకంపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 30: కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి గ్రామం ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి చెందిన శిలాఫలకం కనిపిస్తున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉండటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఫ్లెక్సీలు, బోర్డులు, ప్రారంభోత్సవాలు, శిలాఫలకాలపై ఉన్న బొమ్మలు కనిపించకుండా చూడాలనే నిబంధన ఉంది. మండలంలోని గుల్లదుర్తి ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సీఎం జగన్‌తో కలిసి ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇది పలు విమర్శలకు తావు ఇస్తోంది.

దిగువ అహోబిలంలో హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు మఠం అధికారులు చెప్పారు. స్వామికి నగదు రూపంలో రూ. 42,54,783 వచ్చినట్లు తెలిపారు. పార్వేటలో స్వామికి రూ.7,96,225 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఎగువ అహోబిలంలో భక్తులు బంగారు 135 గ్రాములు, దిగువ అహోబిలంలో 105 గ్రాములు, పార్వేటలో 3 గ్రాములు కానుకలుగా వేశారని చెప్పారు. అలాగే ఎగువ అహోబిలంలో వెండి 4.400 కిలోలు, దిగువ అహోబిలంలో 2.730 కిలోలు, పార్వేటలో 190 గ్రాములు కానుకలుగా సమర్పించారని వారు వివరించారు.

అందరి సహకారంతోనే ప్రజాగళం సక్సెస్

ప్యాపిలి, ఏప్రిల్ 30: అందరి సహకారంతోనే డోన్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభ విజయవంతమైందని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వర రావు యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాల యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమ న్నారు. నాయకులు శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, అంకిరెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీని గెలిపించాలి'

నంద్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీని గెలిపించాలని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్ నాయుడు, విఖ్యాత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో మంగళవారం రుద్రవరం మండలం చందలూరు, ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామాలకు చెందిన వైసీపీకి చెందిన 50 కుటుంబాల కార్యకర్తలు టీడీపీలోచేరారు. వీరందరికి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కోటకందుకూరు మాజీ సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దుర్మార్గ పాలనను సాగనంపండి'



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చాగలమర్రి, ఏప్రిల్ 30: రాష్ట్రంలో దుష్ట పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. మంగళవారం చాగలమర్రి, ఆళ్లగడ్డ పట్టణాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బరుగొడ్ల ఉసేన్‌బాషాతో కలసి లక్ష్మీ నరసింహయాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నీటిని ప్రాజెక్టును, ప్రతి నియోజకవర్గంలో రైతుబజార్ల ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టబద్ధత, పంటల భీమా పథకం అమలు చేస్తామని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని అన్నారు. కాంగ్రెస్ నాయ కులు మహబూబ్‌బాషా, ఆరీఫ్‌బాషా, కిషోర్, మల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'

శిరివెళ్ల, ఏప్రిల్ 30: ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా మండలంలోని మహదేవపురం మజారా గ్రామమైన పచ్చర్లలో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందించారన్నారు. ఆళ్లగడ్డలో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ గెలుపుకు ప్రతి ఎక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వెలుగోడు మహేష్, జమ్మన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ముసుగులో వైసీపీ దోపిడీ

డోన్(రూరల్), ఏప్రిల్ 30: అభివృద్ధి ముసుగులో వైసీపీ పాలకులు దోచుకున్నారని డోన్ కాంగ్రెస్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలోని పలు వీధుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో చెరువులను నీటితో నింపి రైతులను ఆదుకుంటామని వైసీపీ నాయకులు చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మిగిలాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మల్లెంపల్లె జనార్దన్, వడ్డె రాజశేఖర్, సీనియర్ నాయకులు నాగన్న, ఎస్.నాయుడు, శేఖర్, రంగనాయకులు, నాగమద్ది, బాలు, సురేష్, హనుమాన్, రాజు, మహేష్, సుంకన్న పాల్గొన్నారు.

అరటి తోటల హబ్ హామీపై హర్షం

డోన్(రూరల్), ఏప్రిల్ 30: డోన్ నియోజకవర్గ రైతులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అరటితోటల హబ్‌ను ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు హామీపై డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు పరదేశీ మహేష్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం డోన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం ప్రజాగళంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబును కలిసి డోన్ నియోజకవర్గంలో రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో అరటి తోటల హబ్‌ను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ హర్షణీయమన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోండి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 30: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర అన్నా రు. మంగళవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని చిన్న కొప్పెర్ల, పెద్ద కొప్పెర్ల , వల్లంపాడు, రేవనూరు, కలుగోట్ల గ్రామాలలో రేవనూరు ఎస్ఐ రాంమోహన్ రెడ్డితో పాటు కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించా లన్నారు. ఎవరైన ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'మహిళలను లక్షాధికారులను చేయడమే టీడీపీ ధ్యేయం'

డోన్, ఏప్రిల్ 30: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే టీడీపీ లక్ష్యమని కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 8వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా శక్తివంతులుగా తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, యువ నాయకులు ధర్మవరం భరత్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, హనుమంతరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 30: రాష్ట్రంలో చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని 20 వార్డు పరిధిలోగల బూత్ పరిధిలో ఇన్‌చార్జిలచే బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సన్మానం

బేతంచెర్ల, ఏప్రిల్ 30: పట్టణంలోని వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువతో సన్మానించి సర్టిఫికెట్లను మండల విద్యాధికారి సోమశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సం ఘం అధ్యక్షులు కందగడ్డల మోహన్‌రావు, గుప్త, ఎంవీ రమణ, వనిత క్లబ్ అధ్యక్షురాలు ఇందుమతి, కార్యదర్శి నాగజ్యోతి, ఆర్య వైశ్యులు రాజేంద్ర కుమార్, బళ్లారి సూర్య, శ్రీనివాసులు, శేషమోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రుద్రవరం, ఏప్రిల్ 30: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లింగాపురం వెంకటకృష్ణ ఆలియాస్ కిట్టు అనే వ్యక్తిపై సోమవారం రాత్రి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఓ విషయంలో ప్రశ్నించడంతో పేరూరు గ్రామంలో కర్రలతో దాడికి పాల్పడ్డాడు. బాధితుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు లింగాపురం వెంకటకృష్ణ ఆలియాస్ కిట్టుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైసీపీ పతనం మొదలైంది: అఖిలప్రియ



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఏప్రిల్ 30: వైసీపీ పతనం మొదలైందని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను పక్కదోవ పట్టించి ఐదేళ్ల పాటు దోపిడీ చేసి పాలన సాగించారని విమర్శించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. చందలూరు గ్రామానికి చెందిన శ్రీలత, శైలజతో పాటు మరో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిక



గోవిందపల్లెలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన గంగదాసరి బాలనరసింహారెడ్డి(బాలుడు), బత్తుల వెంకటేశ్వర్లు, సుభాష్, వెంకటేశ్వర్లు, దుబాన్, జయలక్ష్మి, కొత్తపల్లె రంగారెడ్డి తదితరులు తమ అనుచరులతో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్న నమ్మకంతో పార్టీలో చేరామని.. ఆళ్లగడ్డలో అఖిలప్రియను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు అన్నారు. కార్యక్రమంలో జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, సంగి రెడ్డి నాగేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.